క్లుప్తంగా

రిటైర్డ్ అటెండర్‌కు సత్కారం



లాల్ జలీల్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

తాళ్లపూడి: తహసీల్దార్ లక్ష్మీ లావణ్య ఆధ్వర్యం లో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ అటెండర్‌గా సుదీర్ఘ సేవలందించి, రిటైరైన షేక్ లాల్‌జలీల్‌ను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహనభారతి, ఆర్‌ఐ రామకృష్ణ, వీఆర్వోలు నాగేశ్వరరావు, సంజీవరావు, లీలవతి, సంతోష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న ఫణి ఠాగూర్

ఉండ్రాజవరం: విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ ఎస్‌వీకే ఫణి ఠాగూర్ అన్నారు. తణుకు ఐసీఐసీఐ బ్యాంక్ ఆర్థిక సహకారంతో మండలంలోని మోర్త ప్రాథమిక పాఠశాల నంబర్-2లో విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎల్‌వీ ప్రసాదరావు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కోకో రైతుల సదస్సు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడిలో ఉన్న గీతామందిరంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు కోకో రైతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు కోకో రైతులు ఉప్పల కాశీ, మట్టపరి సతీష్, పాతూరి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కోకో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ సదస్సులో కో కో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొంటార న్నారు. కోకో రైతులందరూ హాజరు కావాలన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

గోపాలపురం: సత్యసాయి ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కోసం శనివారం ఉదయం 8 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల కోసం సాయంత్రం నాలుగు నుండి ఐదు గంటల వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

తల్లులకు చంద్రబాబు మొండిచేయి

- తల్లికి వందనంలో 20 లక్షల మంది మహిళలకు మోసం
- జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణలో తలారి వెంకట్రావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొదటి నుంచీ నమ్మించి వెన్నుపోటు పొడవడం అలవాటని, మోసం చేయడంలో ఆయనకు తెలిసిన విద్య ఇంకెవ్వరికీ తెలియదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. తాళ్లపూడిలో శుక్రవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని పార్టీ నాయకుల సమక్షంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏడాది పాలనలోనే హామీలన్నీ అమలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు తూతూమంత్రంగా అమలు చేసి, చేతులు దులుపుకొంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైన తర్వాత తల్లికి వందనం పథకం అంటూ 20 లక్షల మంది మహిళలకు మొండిచేయి చూపారని దుయ్యబట్టారు. 2014లో కూడా బూటకపు హామీలిచ్చి, వాటినీ అమలు చేయకుండా రైతుల్ని, మహిళలను మోసం చేశారన్నారు. 2019లో ఎన్నికలకు ఆరు నెలల ముందు కల్లబొల్లి హామీలిచ్చినా ప్రజలు నమ్మలేదని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలన్నింటినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణీత క్యాలెండర్ ప్రకారం అమలు చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలకు రూ.4.65 లక్షల కోట్లు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో వేశారని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను నియమించారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు భవనాలు నిర్మించి, విస్తృత సేవలు అందించారన్నారు. గుంటూరులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో అడుగడుగునా ఆంక్షలు పెట్టారని మండిపడ్డారు. రాష్ట్రంలో దౌర్జన్య పాలన సాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచి, మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయలు, తోట రామకృష్ణ, వల్లభశెట్టి శ్రీనివాస్, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, గూడా వజియరాజు, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, నామా ప్రకాశం, వి.నంద, పి.నాని, బట్టు సుబ్బారావు, మండిగ గిరి, ముళ్ల పోశిబాబు, చిక్కాల మహేష్, గంగారావు, బండ్రెడ్డి సత్యనారాయణ, శూలా పోశియ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణం



దేవరపల్లి జగనన్న కాలనీలో రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

దేవరపల్లి: గ్రామంలోని జగనన్న కాలనీ ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా రోడ్ల సదుపాయం లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దేవరపల్లి–కొవ్వూరు ప్రధాన రహదారిని ఆనుకుని స్థానిక పోలవరం కుడి కాలువకు సమీపంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి దాదాపు 1100 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు అందజేశారు. ఎన్నికల ముందు కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు 200 మంది లబ్ధిదారులు గృహాలను నిర్మించుకుని నివసిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం కాలనీలో మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పించింది. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రోడ్ల నిర్మాణం జరగలేదు. దీంతో రోడ్డు సదుపాయం లేక కాలనీవాసులు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను కాలనీవాసులు ఎంపీపీ కేవీకే దుర్గారావు దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీని సందర్శించిన ఎంపీపీ రోడ్డు నిర్మాణానికి మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వెళ్లే రహదారిని క్వారీ చట్రుతో నిర్మాణం చేపట్టారు. రోడ్డును శుక్రవారం ఎంపీపీ కేవీకే దుర్గారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్, వెలగా శ్రీనివాస్ పరిశీలించారు.

జోరుగా ఖరీఫ్ పనులు



ఉసులుమర్రులో ముురగ దమ్ము చేస్తున్న రైతు

పెరవలి: ముందస్తుగా ఖరీఫ్ పంటకు వేసిన ఆకుమడులు నాట్లు వేయడానికి సిద్ధమవ్వడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ముమ్మరంగా మురగ దమ్ములు ప్రారంభించారు. కాలువ నీరుతో తడిచిన పొలాన్ని దమ్ము చేసి, పుడమి తల్లికి పచ్చని బొట్లు వేయటానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 36 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టగా, ఇందులో నిడదవోలు మండలంలో 16,500 ఎకరాలు, ఉండ్రాజవరంలో 11 వేలు, పెరవలిలో 8,500 ఎకరాల్లో సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముందస్తుగా బోర్లపై తీపర్రు, ఉసులుమర్రు, కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం గ్రామాల్లో ఆకుమడులు వేశారు. ఆయా గ్రామాల్లో నాట్లు వేయటానికి ముందుగా మురగ దమ్ములు ముమ్మరంగా చేపట్టారు. వరినాట్లను యంత్రాలతో వేయాలని, దీని వల్ల సమయం ఆదా, ఖర్చు కూడా తగ్గుతుందని అధికారులు వివరిస్తున్నారు. సకాలంలో నాట్లు పడితే మంచి దిగుబడులు వస్తాయని అంటున్నారు.

బాధ్యతాయుతంగా సేవలు అందించాలి



ఉండ్రాజవరంలో రిటైర్డ్ వీఆర్వోలను సత్కరిస్తున్న అధికారులు



చాగల్లులో రెవెన్యూ సిబ్బందిని సత్కరిస్తున్న తహసీల్దార్

ఉండ్రాజవరం: ప్రజలకు రెవెన్యూ సిబ్బంది సేవలు అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీటీ కనకదుర్గ అన్నారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ వీఆర్వోలు బి.బంగార్రాజు, కేవీ సత్యనారాయణను డీటీ కనకదుర్గ, వీఆర్వోలు ఘనంగా సత్కరించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన సూర్యారావుపాలెం, వడ్లూరు, వేలివెన్ను, సత్యవాడ వీఆర్వోలకు, సత్యవాడ, తాడిపర్రు వీఆర్ఏలకు అభినందన సర్టిఫికెట్లను అందజేశారు.

సిబ్బంది కీలక పాత్ర

చాగల్లు: రెవెన్యూ దినోత్సవం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం.మెరికమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఆమె మాట్లాడుతూ, రెవెన్యూ వ్యవస్థ ప్రజలకు అందించే సేవల విషయంలో సిబ్బంది అలసత్వం చూపరాదన్నారు. భూమి రికార్డుల నిర్వహణ, పన్నుల వసూలు, సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందిని సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ కమల్‌సుందర్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

సక్రమంగా వినియోగించుకోవాలి

నిడదవోలు రూరల్: రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్ అన్నారు. కోరుమామిడిలో రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సేవలపై రిటైర్డ్ తహసీల్దార్ డి.విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సత్యేంద్ర, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థికాభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు చేతివృత్తులు నేర్చుకోవడం ద్వారా ఆర్థికంగా బలపడవచ్చని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం హాలులో శుక్రవారం జరిగిన 78వ బ్యాచ్ కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల స్వయం ఉపాధి కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ తరఫున శిక్షణ ఇవ్వడంతో పాటు మెటీరియల్ కూడా అందిస్తున్నామన్నారు. శిక్షణ అనంతరం ఒంటరి మహిళలకు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారికి ఇప్పటివరకు సుమారు 500 కుట్టుమెషీన్లు బహూకరించామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి వీజీవీ లక్ష్మి, శిక్షణ టీచర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

జేగురుపాడు పంచాయతీకి అనుకూలంగా తీర్పు

కడియం: జేగురుపాడు పంచాయతీకి అనుకూలంగా వినియోగదారుల ఫోరం తీర్పునిచ్చిందని పంచాయతీ కార్యదర్శి ఐ.శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం స్థానిక విలేకరులకు తెలిపారు. 2023 సెప్టెంబర్ 9న పంచాయతీ తాగునీటి ట్యాంకర్ ప్రమాదశాత్తూ తిరగబడి పాక్షికంగా దెబ్బతింది. ఆ ట్రాక్టర్‌కు చోళ మండలం ఎంఎస్ జనరల్ బీమా కంపెనీ పాలసీ తీసుకున్నారు. ప్రమాద సమయానికి అది ఫోర్సులోనే ఉందన్నారు. అన్ని వివరాలు ఇన్సూరెన్స్ కంపెనీకి అందించినప్పటికీ క్లెయిమ్ చేసేందుకు వారు నిరాకరించారు. దీంతో అప్పటి పంచాయతీ కార్యదర్శి బి.శిరీష 6.2.2024న వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. వినియోగదారుల సభ్యులు ఆర్.శ్రీనివాసరాజు శుక్రవారం ఈ మేరకు విచారణ చేసి, తీర్పు వెలువరించారు. ట్రాక్టర్ మరమ్మతులకు అయ్యే రూ.81,788తో పాటు, ఖర్చుల కింద రూ.20 వేలను 45 రోజుల్లోపుగా చెల్లించాలని, లేకపోతే 12 శాతం వడ్డీతో కట్టాలని ఆ బీమా కంపెనీకి ఆదేశించారు.

జీవన శైలి యోగా



యోగా సాధన చేస్తున్న ఉద్యోగులు



యోగాసనాలు ప్రదర్శిస్తున్న సభ్యులు



హలాసనం వేసిన రవీంద్రనాథ్

దేవరపల్లి: యోగా శారీరక వ్యాయామం మాత్రమే కాదని, ఓ జీవన శైలి అని స్థానిక పరమేశు బయోటెక్ పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎస్.శివప్రసాద్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పరిశ్రమ వద్ద ఉద్యోగులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ శిక్షణ ఇచ్చారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రాణాయామం వల్ల మెదడు ప్రశాంతంగా ఉంటుందన్నారు. యోగా చేసి అనారోగ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం

యోగా సాధన ద్వారా మానసిక ఆరోగ్యం కలుగుతుందని శాప్ డైరెక్టర్, మాజీ ఫిజికల్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడారు. యోగా పట్ల ప్రజల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అరగంట యోగా చేస్తే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి, వ్యక్తి లక్ష్యసాధనకు తోడ్పడుతుందన్నారు. చిన్నప్పటి నుంచి యోగా సాధన చేస్తూ వేలాది మందికి తర్ఫీదు ఇచ్చిన రవీంద్రనాథ్.. యోగాను విద్యలో భాగం చేయాలని ఆకాంక్షించారు. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు ప్రతి పాఠశాలలో యోగా పాఠ్యాంశంగా ఉండాలన్నారు.

ఆరోగ్య రక్షణ ముఖ్యం

తాళ్లపూడి: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్పీవో అమ్మాజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గాయత్రీ యోగా సేవా సమితి వార్షికోత్సవం తాళ్లపూడిలో యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. యోగా కేంద్రంలో శిక్షణ పొందిన ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావుతో పాటు, పలువురు యోగాసనాలు ప్రదర్శించి, తమ ప్రతిభను చూపారు. అదేవిధంగా కరాటే ప్రదర్శన కూడా ఆకట్టుకుంది. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీలావణ్య, డిప్యూటీ ఎంపీడీఓ కేఎస్ వీరన్న, రైస్ మిల్లర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

యోగా సాధనలో విద్యార్థులు

యోగాంధ్రలో భాగంగా స్థానిక కరి బండి విద్యా సంస్థల ఆధ్వర్యంలోని ఎస్‌కేజీఆర్ అండ్ ఎస్ఎస్‌కే జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా గురువు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ధ్యానం, యోగాసనాల సాధన చేయించారు. ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నిడదవోలు మండల శాఖ ఆధ్వర్యంలో యోగా డే కార్యక్రమాలు నిర్వహించారు. యోగా గురువు కేఎస్‌వీ పురుషోత్తమ కుమార్ యోగాసనాలు చేయించారు. అనంతరం ఆయనను సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నిడదవోలు శాఖ అధ్యక్షుడు బలగం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు, సభ్యులు కేజేకే సామ్రాజ్యం, బి.పాపారావు, కొప్పుల వెంకటేశ్వరరావు, గణేష్, వి.సింహాద్రి, జెట్టి మోహన్‌రావులు పాల్గొన్నారు. కాగా అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గణపతి సెంటర్‌లోని ఐ లవ్ నిడదవోలు వద్ద శనివారం ఉదయం 6 గంటలకు యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి తెలిపారు.

అవగాహన ర్యాలీ

చాగల్లు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చాగల్లులో లయన్స్ క్లబ్, రాజరాజేశ్వరి విద్యాలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, మానసిక, శారీరక రుగ్మతల నుంచి ఉపశమనం పొందడానికి యోగా ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ వెంకట రామారావు, వైద్యుడు డాక్టర్ సాంబశివరావు, నల్లూరి అప్పారావు, యోగా టీచర్ మృదుల పాల్గొన్నారు.



చాగల్లులో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



నిడదవోలులో యోగా గురువు పురుషోత్తమ కుమార్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు